క్లుప్తంగా

పన్ను చెల్లించి రాయితీ పొందండి

నరసరావుపేట: పురపాలక సంఘ పరిధిలోని ఆస్తిపన్ను యజమానులు 2025–2026 ఆర్థిక ఏడాదికి సంబంధించి తమ భవనములు, ఖాళీస్థలాల పన్నులను ప్రభుత్వం కల్పించిన ఐదు శాతం రాయితీ మినహాయించి మొదటి, రెండో అర్ధ సంవత్సరపు చెల్లించాల్సిన ఆస్తి పన్ను, ఖాళీ స్థలం పన్నులను ఏకమొత్తంగా ఈనెలాఖరులోగా చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు కోరారు. దీనికి గాను కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఆరుగంటల వరకు ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్, ఆన్‌లైన్ వెబ్‌సైట్ www.cdma.a p.gov.inలో చెల్లించి పురపాలక సంఘ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ప్రభుత్వ సెలవు దినములలో కూడా పన్ను చెల్లింపుకు ఏర్పాటు చేసిన కౌంటర్లు యధావిధిగా పనిచేస్తాయని పేర్కొన్నారు.

యడ్లపాడు ఎస్‌ఐగా శివరామకృష్ణ



యడ్లపాడు: మండలం స్టేషన్ నూతన ఎస్‌ఐగా టి శివరామకృష్ణ సోమవారం బాధ్యతలను చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ వి బాలకృష్ణ బదిలీపై ఏప్రిల్ 4వ తేదీన జిల్లాకేంద్రం నరసరావుపేట ఎస్‌బికు వెళ్లారు. ప్రస్తుతం చిలకలూరిపేట పట్టణంలోని అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న టి శివరామకృష్ణ సోమవారం బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది పుష్పగుచ్ఛాలను ఇచ్చి స్వాగతించారు.

చోరీ కేసుల్లో జైలు, జరిమానా

నరసరావుపేటటౌన్: వేర్వేరు ప్రాంతాల్లో మోటార్ సైకిల్ దొంగిలించినట్లు నేరం రుజువు అవడంతో నిందితుడు పట్టణంలోని వరవ కట్టకు చెందిన షేక్ అష్రఫ్‌కు ఒక్కొక్క కేసులో మూడు నెలల జైలు శిక్ష, రూ. 1000 రూపాయలు జరిమానా విధిస్తూ స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి టి. ప్రవల్లిక సోమవారం తీర్పు చెప్పారు. నిందితుడు 2024 సంవత్సరంలో మొదటి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో మూడు ద్విచక్ర వాహనాలను దొంగిలించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు అవ్వడంతో పై విధంగా కోర్టు తీర్పు వెలువరించారు.

గుండేపల్లి సర్పంచ్‌గా ఏడుకొండలు

ఈపూరు(శావల్యాపురం): మండలంలోని గుండేపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్‌గా అబ్బూరి ఏడుకొండలు సోమవారం ప్రమాణ స్వీకారం చేసినట్లు పంచాయతీ కార్యదర్శి ముంద్రు మనోహర్ తెలిపారు. ఇప్పటి వరకు గ్రామసర్పంచ్‌గా కాసరగడ్డ మల్లిఖార్జునరావు వ్యవరించారు. దీర్ఘకాలిక సెలవుపై వెళ్లినందున సర్పంచ్ బాధ్యతలు ఏడుకొండలు స్వీకరించారన్నారు.

పంచాయతీ కార్యదర్శిగా జ్యోత్స్న

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామపంచాయతీ పంచాయతీ కార్యదర్శిగా మిరియాల జ్యోత్స్న సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు వ్యక్తిగత సెలవుపై ఐదు నెలల పాటు వెళ్లినట్లు జ్యోత్స్న తెలిపారు.. ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శిగా చింతా శ్రీనివాసరావు వ్యవహరించారు. అనంతరం ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, ఈవోపీఆర్‌డి. పి.సుగుణలను మర్యాద పూర్వకంగా కలిశారు.

ఆయుర్వేద వైద్యుడు చిలకల మృతి



వినుకొండ: వినుకొండ పట్టణానికి చెందిన ప్రముఖ ఆయుర్వేద వైద్యులు చిలకల ఆంజనేయులు (83) ఆదివారం రాత్రి మృతి చెందారు. వినుకొండ పట్టణం, పరిసర ప్రాంతాల్లో ప్రజలకు ఆయన అనేక సంవత్సరాలుగా ఆయుర్వేద వైద్యం చేస్తూ అందరికీ సుపరిచితులయ్యారు. ఆయన మృతదేహాన్ని పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది పీజే లూకా, కాకాని నాగేశ్వరరావు తదితరులు సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

దుప్పట్లు, సబ్బులు పంపిణీ

నరసరావుపేట: మున్సిపల్ అతిథి గృహంలో సోమవారం సాయంత్రం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు, నూనె, సబ్బులు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. దీనికి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ముఖ్యఅతిథిగా హాజరై కార్మికులకు అందజేశారు. రెడ్‌క్రాస్ వారి సేవలను అభినందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.

భూమి ప్రభుత్వానిది...

మట్టి నాయకులది !

పాత ఉప్పలపాడులో అక్రమంగా మట్టిదందా!

- జేబులు నింపుకుంటున్న టీడీపీ నాయకులు
- ప్రేక్షక పాత్ర పోషిస్తున్న అధికారులు



టిప్పర్లకు మట్టి తోడుతున్న పొక్లయినర్

నూజెండ్ల: కూటమి ప్రభుత్వ హయాంలో స్థానిక టీడీపీ నాయకులు ఇష్టానుసారంగా ప్రభుత్వ స్థలంలో అక్రమంగా మట్టి తవ్వుకుని దానిని అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని పాత ఉప్పలపాడు గ్రామ సమీపంలో వందల ఎకరాల్లో ఉన్న ప్రభుత్వ భూమిలో అక్రమంగా మట్టి తవ్వకాలకు పాల్పడుతున్నారు. ఈ మట్టిని టిప్పర్ల ద్వారా రవాణా చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. వినుకొండ పరిసర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ భూములకు గిరాకీ పెరగడంతో మెరక తోలకం పనులు చేపట్టారు. అక్రమ మట్టి మాఫియా పనులను ఆసరాగా తీసుకొని ట్రిప్పర్లకు నగదు వసూలు చేస్తూ టీడీపీ నేతలు నాలుగు రాళ్లు వెనకేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు తమకేమీ పట్టనట్టు చోద్యం చూస్తున్నారు.

ఏకధాటిగా మట్టి తరలింపు!

వినుకొండ నుంచి నూజెండ్లకు వెళ్లే రహదారి మార్గంలో అధిక లోడుతో ట్రిప్పర్ల ఏకధాటిగా రాకపోకలు రవాణా చేయటంతో రోడ్డు పాడైందని గ్రామస్తులు వాపోతున్నారు. అంతేకాక రోడ్డుపై గుంతలు ఏర్పడితే వాహనదారులు ప్రమాదాలు జరుగుతాయని ఆందోళన చెందుతున్నారు. నిత్యం ఈవిధంగా జరుగుతుంటే ఈరహదారి మార్గంలో కార్యాలయాలకు వెళుతున్న రెవెన్యూ అధికారులు పట్టించుకోవటం లేదని ప్రజలు నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ భూముల్లో అక్రమ మట్టి మాఫియా నిర్వాకం వలన ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. అంతే కాకుండా అధికారులకు సైతం ఇందులో భాగస్వామ్యం ఉండి ఉండవచ్చునని పలువురు స్థానికులు అభిప్రాయపడుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ భూముల్లో అక్రమ మట్టి మాఫియాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

అధికారులకు సమాచారమిచ్చినా..



నాలుగు రోజుల నుంచి మట్టి యధేచ్ఛగా తరలిస్తున్నారు. సంబంధిత అధికారులకు సమాచారం అందించాం. దీంతో ఒకరోజు తోలకం నిలిపినప్పటికీ మళ్లీ కొనసాగుతోంది. అక్రమంగా మట్టి తరలించి జేబులు నింపుకుంటున్నారు.

– మద్దుల సత్యం, పాత ఉప్పలపాడు

విచారణ చేపడతాం

ప్రభుత్వ భూముల్లో అక్రమంగా మట్టి తొలకం పనులు చేయడం నేరం. ఎటువంటి అనుమతులు లేకుండా ఇలాచేయడం తప్పు. విషయం ఇప్పటి వరకూ తన దృష్టికి రాలేదు. సత్వరమే విచారణ చేసి చర్యలు తీసుకుంటా.

–ఆర్.రమేష్‌కుమార్, తహసీల్దారు, నూజెండ్ల

‘అటవీ’ వేధింపులపై దళిత రైతులు వినతి

కలెక్టరేట్‌లో ఫిర్యాదుచేసిన దళిత రైతులు, ఏపీ కౌలు రైతు సంఘం నాయకులు



ఫిర్యాదు చేసేందుకు వచ్చిన దళితరైతులు, నాయకులు

నరసరావుపేట: అటవీ భూమికి ఎటువంటి సంబంధం లేకపోయినా అటవీ భూములకు సమీపంలో ఉన్న భూములకు సంబంధించి డీకే పట్టా ఉన్నప్పటికీ అటవీశాఖ అధికారులు దళిత రైతులను భూముల్లోకి వెళ్లనీయకుండా ఇబ్బందులకు గురిచేయడం తగదని కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా కమిటీ సభ్యులు తిమ్మిశెట్టి హనుమంతరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆ భూములకు చెందిన దళిత రైతులతో కలిసి సోమవారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ 1992లో అచ్చంపేట మండలం తాళ్లచెరువు, చెరుకుంపాలెం గ్రామాలలో భూమిలేని ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 92 పేద కుటుంబాలకు అప్పటి వ్యవసాయ శాఖ మంత్రి కోనేరు రంగారావు, పెదకూరపాడు ఎమ్మెల్యేగా ఉన్న కన్నా లక్ష్మీనారాయణ సర్వే నెం 306 నుంచి 330కి చెందిన 92 ఎకరాల ప్రభుత్వ భూమిని కుటుంబానికి ఒక ఎకరా చొప్పున పంపిణీ చేశారని అన్నారు.

అప్పటి నుంచి వారు ఆ భూములను సాగు చేసుకుంటూ వారసత్వంగా అనుభవిస్తున్నారన్నారు. బ్రతుకుదెరువు కోసం వలస వెళ్లి ఇటీవల తిరిగి వచ్చిన 18 కుటుంబాలకు చెందిన భూములను బాగు చేసుకునేందుకు వెళ్లిన వారిని అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారని, అదేమని ప్రశ్నిస్తే అటవీ భూములకు సమీపంలో ఉన్న నేపథ్యంలో భూముల్లోకి రావొద్దని చెప్పడం వెనుక ఎవరి ప్రయోజనం దాగి ఉందో అర్థంకావడం లేదన్నారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని దళిత రైతులకు న్యాయం చేయాలని కోరారు. సమస్య పరిష్కరించకపోతే కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో రైతుల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు.

బెల్ట్‌షాపులపై నిఘా ఉంచాం

శావల్యాపురం: గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వినుకొండ ఎక్సైజ్ సీఐ దేవర శ్రీనివాసరావు హెచ్చరించారు. సోమవారం మండలంలోని పిచికలపాలెం గ్రామం వాటర్ ట్యాంకు పరిధిలో అనధికారికంగా బెల్ట్ షాపు నడుపుతున్న గ్రామానికి చెందిన టి.రామాంజనేయులుపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. గ్రామాల్లో అనధికారికంగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చట్టపరంగా అటువంటి వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లో పోలీసులు నిఘా ఉంచామన్నారు.

ఫిల్టర్‌బెడ్స్‌కు ప్రతిపాదనలు

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామంలో రక్షిత మంచినీటి చెరువును మైక్రో ఫిల్టర్ బెడ్స్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.రతన్‌బాబు సోమవారం తెలిపారు. ఈసందర్భంగా రూ.10 లక్షల వ్యయంతో వీటిని ఏర్పాటు చేయనున్నామని, అయితే పంచాయతీ అమోదం పొందగానే పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు.

త్వరలో రీసర్వే పనులపై గ్రామసభ

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామంలో రీసర్వే పనులకు సంబంధించి త్వరలో రైతులతో గ్రామసభను నిర్వహిస్తామని తహసీల్దారు కె.సుజాత సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ కారుమంచి రెవెన్యూ గ్రామ పరిధిలో 7226 ఎకరాలు భూములు ఉండగా అందులో ప్రభుత్వ భూములు 516 ఎకరాలు ఉందన్నారు. ప్రభుత్వ భూముల్లో సరిహద్దు రాళ్ళు గుర్తించే పనులు సర్వే టీం చేస్తున్నట్లు తెలిపారు. రైతులతో సమీక్షించిన అనంతరం పట్టాదారు భూముల్లో రీసర్వే పనులు ప్రారంభిస్తామన్నారు. మండల సర్వేయర్ రాజు, సర్వే అధికారి పేరిసోముల నాసరయ్య, వీఆర్వో దూపాటి దేవమ్మ ఉన్నారు.

10 నుంచి డీఎస్సీ కోచింగ్ ప్రారంభం

వినుకొండ : పట్టణంలోని లాయర్‌స్ట్రీట్‌లోని విశ్వసాయి జూనియర్ కళాశాలలో ఈ నెల 10వ తేదీ నుంచి డీఎస్సీ కోచింగ్‌ను ప్రారంభిస్తున్నామని కళాశాల డైరెక్టర్ డాక్టర్ యడవల్లి శ్రీనివాసశర్మ తెలిపారు. దీనికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అతి తక్కువ ఫీజులతో అత్యుత్తమ బోధన అందిస్తున్నట్లు తెలిపారు. డీఎస్సీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డీసీ చైర్మన్ గంగినేని రాఘవరావు, కళాశాల యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

ఎంపీపీ మొరబోయిన సుబ్బాయమ్మ



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ సుబ్బాయమ్మ, జెడ్పీటీసీ చిట్టిబాబు తదితరులు

నరసరావుపేట రూరల్: వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ మొరబోయిన సుబ్బాయమ్మ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ సుబ్బాయమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీడీవో టీవీ కృష్ణకుమారి, జెడ్పీటీసీ పదముత్తం చిట్టిబాబులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. ఆర్‌డబ్ల్యూఎస్ఏఈ యాసిన్ మాట్లాడుతూ బోర్లు మరమ్మత్తులు పూర్తిచేయడంతో పాటు చెరువులను నీటితో నింపుతున్నట్లు తెలిపారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. జిల్లాలో తాగునీటి సమస్య పరిష్కారానికి చేపట్టిన వాటర్ గ్రిడ్ పథకం టెండర్ల దశలో ఉందని తెలిపారు. జలజీవన్ మిషన్ పథకంలో నిర్వహిస్తున్న పనులపై జెడ్పీటీసీ చిట్టిబాబు, పలువురు ఎంపీటీసీలు ప్రశ్నించారు. కనెక్షన్ కోసం మెయిన్ పైప్ నుంచి కుళాయి ఇచ్చే పైప్ చిన్నదిగా ఉండటంతో నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని తెలిపారు. దీంతో పాటు ఆయా పనుల కోసం తవ్విన గుంతలను కాంట్రాక్టర్లు వెంటనే పూడ్చకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. దీనిపై సత్వరం చర్యలు తీసుకుంటామని ఏఈ తెలిపారు. పంచాయతీ రాజ్ ఏఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రూ.3 కోట్ల పనులకు టెండర్లు పూర్తచేసినట్టు తెలిపారు. అయితే ఇప్పటి వరకు చేసిన పనులకు బిల్లులు ప్రభుత్వం నుంచి విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని తెలిపారు. సమావేశంలో వ్యవసాయ శాఖ ఏవో సురేంద్రబాబు, ఏపీవో కోటేశ్వరరావు, ఈవోపీఆర్‌డీ నాగానంద్ పాల్గొన్నారు.

ఘనంగా దేవాలయ వార్షికోత్సవం



రొంపిచర్ల: మండలంలోని నల్ల గార్లపాడు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ సువర్చలా సమేత వీరాంజనేయస్వామి దేవాలయ 40వ వార్షికోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారు జాము నుండే భక్తులు స్వామిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు ఆలయం ప్రాంగణంలో పొంగళ్లు నిర్వహించి స్వామి వారికి నైవేద్యాలు సమర్పించారు. అర్చనలు, ఆకుపూజలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. రాత్రి వేళ స్వామి వారికి భజనా కార్యక్రమాలు నిర్వహించారు. రొంపిచర్ల పోలీసులు శాంతి భద్రతలు పర్యవేక్షించారు.

స్కూల్ తరలింపు ప్రయత్నాన్ని మానుకోవాలి



ఎంఈఓ–2 రాఘవేంద్రరావుకు వినతి పత్రం అందిస్తున్న నందిగామ ఎస్సీ కాలనీ వాసులు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం నందిగామ ఎస్సీ కాలనీలోని ఎంపీపీఎస్(ఎల్ఈ) పాఠశాల తరలింపు ప్రయత్నం మానుకోవాలని నివాసితులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం మండల విద్యాశాఖ అధికారి–2 ఏ రాఘవేంద్రరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలోని స్కూలును ఓసీ కాలనీకి తరలించడానికి కూటమి ప్రభుత్వంలోని నాయకులు ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఎస్సీ కాలనీలో ఒకటో తరగతి, రెండో తరగతి మొత్తం 36 మంది విద్యార్థులు ఉన్నారన్నారని, అంగన్‌వాడీ కేంద్రంతో కలిసి మొత్తం పిల్లలు ఇబ్బందులు పడే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. అదీ కాకుండా 15 మంది ఉన్న ఓసీ కాలనీ ఎంపీపీఎస్(హెచ్ఈ) స్కూల్‌కి పంపించాలని ఎస్సీ కాలనీవాసులను టీడీపీ మండల కన్వీనర్ ఆళ్ల అమరేశ్వరరావు బెదిరిస్తున్నాడని ఆరోపించారు. దీనిపై జిల్లా కలెక్టర్, విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని విద్యార్థి కమిటీ, తల్లిదండ్రులు కోరారు.

మూడు బైక్‌లు అపహరణ

నరసరావుపేట టౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో నిలిపి ఉన్న మూడు ద్విచక్ర వాహనాలు అపహరణకు గురైన సంఘటనలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎంవీ. చరణ్ సోమవారం తెలిపారు. గడియార స్తంభం, డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు హాస్పటల్, ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల డీమార్ట్ సెంటర్‌లలో నిలిపిన ద్విచక్రవాహనాలు అపహరణకు గురయ్యాయి. ఈ మేరకు వాహన యజమానులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ఆస్తి పన్ను చెల్లిస్తే రాయితీ

వినుకొండ: పట్టణ ప్రజలు 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్నులను ఏప్రిల్ 30 లోగా ఒకేసారి చెల్లిస్తే ఐదు శాతం రాయితీ లభిస్తుందని వినుకొండ పట్టణ మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. సెలవు రోజుల్లో కూడా పన్ను చెల్లించే వెసులుబాటును కల్పించినట్లు పేర్కొన్నారు.

వేధింపులకు పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి

నరసరావుపేట: సత్తెనపల్లి మండలం కంకణాలపల్లి గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్‌పై లైంగిక వేధింపులకు పాల్పడిన తెలుగుదేశం పార్టీ నాయకుడు బొడ్డు వెంకటేశ్వరావుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతోపాటు లైంగిక వేధింపుల సెక్షన్ల కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కేపీ మెటిల్డాదేవి, గుంటూరు మల్లీశ్వరిలు డిమాండ్ చేశారు.

ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారు తాత్సారం చేశారని ఈ నేపథ్యంలో వేధింపులు మరింత ఎక్కువ కావడంతో ప్రజా ప్రతినిధులకు సెల్ఫీ వీడియో విడుదల చేయడం వెనుక పరిస్థితిని అధికారులు, ప్రజాప్రతినిధులు అర్థం చేసుకోవాలన్నారు.

ఇటీవల నకరికల్లు మండలం పాపిశెట్టివారిపాలెం గ్రామంలో అంగన్‌వాడీ టీచర్ ఫాతిమా బేగం రాజకీయ, లైంగిక వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకున్న ఘటనను గుర్తు చేశారు. గతంలో వంట గదికి పరిమితమైన మహిళలు సత్తా చాటి అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, అంగన్‌వాడీ రంగంలో గౌరవ వేతనం తీసుకుంటూ విశేషసేవలు అందిస్తున్న మహిళలను గౌరవించి, ప్రోత్సహించాలన్నారు. వెంటనే హోం మంత్రి అనిత స్పందించి ఈ కేసులో విచారణ వేగవంతం చేయాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా వేధింపులకు పాల్పడిన వారిపై కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

జాతీయ తైక్వాండో పోటీలకు ఎంపిక



తులసీతన్మయ్‌ను అభినందిస్తున్న కళాశాల యాజమాన్య ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: జాతీయస్థాయి తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలకు శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల విద్యార్థిని వి.తులసీతన్మయ్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ యక్కల మధుసూదనరావు సోమవారం తెలిపారు. తెనాలిలో ఈనెల ఈనెల 2, 3తేదీలలో నిర్వహించిన 5వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్యాడేట్ అండ్ తైక్వాండో చాంపియన్‌షిప్ – 2025 పోటీలో తులసీ తన్మయ్ 49 కేజీల విభాగంలో ప్రథమ స్థానం సాధించి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించినట్టు వివరించారు. ఢిల్లీలో ఆగస్టులో నిర్వహించనున్న 5వ జాతీయస్థాయి తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు. కళాశాల పాలకవర్గ అధ్యక్ష్య, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, కార్యదర్శి నాగసరపు సుబ్బరాయగుప్త, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధీర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి, నర్సింగ్ ఇన్‌చార్జ్ ఏవీఎస్ గుప్త, పీడీ డాక్టర్ మధుసూదనరావు, అధ్యాపకులు తులసీతన్మయ్‌ను అభినందించారు.

ఉరుములు, మెరుపులతో ఈదురు గాలులు

రొంపిచర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురు గాలులు వీచాయి. ఈదురు గాలులకు అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సుమారు గంట పాటు ఈ పరిస్థితి నెలకొంది. ఈదురు గాలులు తగ్గినప్పటికీ విద్యుత్ సరఫరా జరగలేదు. పిడుగురాళ్ల ప్రాంతంలో వర్షంతో కూడిన వీదురు గాలులు వీచటం వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిదంని తెలిసింది. అయితే మండలంలో రాత్రి నెలకొన్న వాతావరణ పరిస్థితులకు వర్షం పడుతుందని ప్రజలు ఊహించారు. ఈదురు గాలుల వల్ల వర్షం కురియలేదని ప్రజలు అభిప్రాయపడ్డారు.

నరసరావుపేటలో...

నరసరావుపేట: పట్టణంలో సోమవారం సాయంత్రం ఈదురుగాలులతో స్వల్పంగా వర్షం కురిసింది. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గాలులు తగ్గిన తర్వాత కొన్ని ప్రదేశాల్లో ట్రాన్స్‌ఫార్మర్‌లు వద్ద ఫీజులు ఎగిరిపోవటంతో లైన్‌మెన్‌లో వాటిని సరిచేసే ప్రయత్నాలు చేశారు. చాలా ప్రాంతాల్లో విద్యుత్‌సరఫరాకు అంతరాయం ఏర్పడింది. బలమైన ఈదురుగాలులకు తేలికపాటి వస్తువులు కొట్టుకుపోయాయి. ఎక్కడా ఆస్తినష్టం జరిగినట్లుగా సమాచారం లేదు.

ప్రభుత్వ విధానాలపై ప్రజలు ఉద్యమించాలి

సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు



ప్రచార జాతా నిర్వహిస్తున్న నాయకులు

రొంపిచర్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై ప్రజలు ఉద్యమించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు అన్నారు. భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా సీపీఐ ఆధ్వర్యంలో మార్చి 23 నుండి ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతి వరకు జరుగుతున్న సీపీఐ రాజకీయ ప్రచార జాతా కార్యక్రమం 16వ రోజైన సోమవారం రొంపిచర్లలో నిర్వహించారు. సీపీఐ నాయకులు, కార్యకర్తలు గ్రామంలో ప్రచారం నిర్వహించి, కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ, కార్పోరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నాయన్నారు. సీపీఐ ఏరియా కార్యదర్శి చక్రవరం సత్యానారాయణరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ వర్గాల వారికి రాయితీలు ఇస్తూ, పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలపై పెనుభారాలు మోపుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, ప్రజానాట్యమండలి కళాకారులు షేక్ చిన్న సైదా, సీపీఐ నరసరావుపేట పట్టణ కార్యదర్శి వైదన వెంకట్, సీపీఐ మండల నాయకులు ముప్పూరి మధుసూదనరావు, మన్నం ఆంజనేయులు, పిడెం హుస్సేన్, రమేష్, మోహనరావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించి..

వ్యాపారం చేసుకోండి

- స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి
- కలెక్టరేట్‌లో చెట్టినాడ్, భవ్య సంస్థల ప్రతినిధులకు సూచించిన కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ సూరజ్

నరసరావుపేట: చెట్టినాడ్, భవ్య సిమెంట్స్ సంస్థలు స్థానికుల సమస్యలు పరిష్కరించి యథేచ్ఛగా వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుకోవచ్చని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి ఎంత ముఖ్యమో, ఆ అభివృద్ధి కారణంగా నష్టపోతున్న వారి ప్రయోజనాలు సైతం అంతే ముఖ్యమన్నారు. దాచేపల్లి మండలంలో సిమెంట్ ఫ్యాక్టరీల కారణంగా సమస్యలు ఎదుర్కొంటున్న తక్కెళ్లపాడు, పెదగార్లపాడు, తంగేడ గ్రామస్తుల డిమాండ్లు పరిష్కరించి ఫ్యాక్టరీలు తిరిగి ప్రారంభించే విషయమై సోమవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. భూములు కోల్పోయిన వారికి, స్థానికులకు ఉపాధి కల్పించేందుకు చెట్టినాడ్, భవ్య సంస్థలు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. వారం రోజుల్లోగా తాత్కాలిక ప్రాతిపదికన పనిచేస్తున్న సిబ్బందికి శాశ్వత ఉద్యోగులుగా గుర్తిస్తూ నియామక పత్రాలు అందించాలన్నారు. ఫ్యాక్టరీల నుంచి వెలువడే దుమ్ము కారణంగా దెబ్బతింటున్న పంటలు, మైనింగ్ కారణంగా దెబ్బ తిన్న ఇళ్లకు పరిహారం అందించాలన్నారు. ఫ్యాక్టరీల కార్యకలాపాల కారణంగా ప్రభావితమవుతున్న వ్యవసాయ భూములను సిమెంట్ సంస్థలే కొనుగోలు చేయడం లేదా లీజుకు తీసు కోవడం ద్వారా రైతులకు న్యాయం చేయాలన్నారు. ఫ్యాక్టరీలలో కనీసం 33 శాతం పచ్చదనం ఉండేలా మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. ప్రభావిత గ్రామాల్లో తాగునీటి సరఫరా వంటి కనీస అవసరాల కోసం కోటి రూపాయలకు తగ్గకుండా సీఎస్ఆర్ నిధులు వెచ్చించాలన్నారు.

భవ్య సిమెంట్స్ వారి ఫౌండేషన్ ఆధ్వర్యంలోని డీఏవీ పాఠశాలను రేపటి నుంచి ప్రారంభించకపోతే తీవ్రంగా పరిగణిస్తామన్నారు. జాయింట్ కలెక్టర్ గనోరే సూరజ్ ధనుంజయ్, డీఆర్వో మురళి, గురజాల ఆర్డీవో మురళీకృష్ణ, సామాజిక కార్యకర్త సిరిమామిళ్ళ వెంకటేశ్వరరావు, చెట్టినాడ్, భవ్య సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.